క్లుప్తంగా

సీపీఎం రాష్ట్ర కార్యదర్శిని కలిసిన నాయకులు



జాన్ వెస్లీకి శుభాకాంక్షలు తెలుపుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

భానుపురి: సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన జాన్‌వెస్లీని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా కమిటీ సభ్యులు సోమవారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ములకలపల్లి రాములు, మట్టిపల్లి సైదులు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ జంపాల స్వరాజ్యం, వ్యవసాయ కార్మిక సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు బొజ్జ చిన్న వెంకులు పాల్గొన్నారు.

చిన్నారులకు వినూత్న రీతిలో బోధన



మాచనపల్లిలో చిన్నారులకు మట్టిబొమ్మలతో బోధిస్తున్న సిబ్బంది

నూతనకల్ : చిన్నారులకు అర్థమయ్యే విధంగా వినూత్న రీతిలో విద్యాబోధన చేస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజులతరెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని మాచనపల్లి, బిక్కుమళ్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చిన్నారులకు బంకమట్టితో వివిధ రకాల బొమ్మలను తయారు చేయించి వారికి అర్థమయ్యే విధంగా విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల అధికారులు

అర్వపల్లి : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 27న జరగనుండటంతో అర్వపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని సోమవారం తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్, ఎంఈఓ బాలునాయక్ పరిశీలించారు. మండలంలోని ఉపాధ్యాయులు ఈ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకోనున్నారని చెప్పారు. ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా కేంద్రంలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ చిప్పలపల్లి యాదగిరి, గిర్దావర్ పాటి వెంకట్‌రెడ్డి, హెచ్ఎం యాకలక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాలల్లో 'పరీక్షపే చర్చా'



జాజిరెడ్డిగూడెం పాఠశాలలో ప్రధాని మోదీ ప్రసంగాన్ని తిలకిస్తున్న విద్యార్థులు

అర్వపల్లి : త్వరలో 10వ తరగతి వార్షిక పరీక్షలు జరగనుండటంతో సోమవారం ప్రధాని మోదీ పరీక్షపే చర్చా కార్యక్రమాన్ని విద్యార్థులకు డిజిటల్ స్క్రీన్ ద్వారా ప్రదర్శించారు. మండలంలోని అన్ని జెడ్పీహెచ్ఎస్‌లలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రత్యేక స్క్రీన్‌లలో ప్రధాని ప్రసంగాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలునాయక్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తుంగతుర్తి మండల అధ్యక్షురాలిగా పులి సత్తమ్మ



తుంగతుర్తి : గానుగుబండ గ్రామానికి చెందిన పులి సత్తమ్మ కాంగ్రెస్ పార్టీ తుంగతుర్తి మండల అధ్యక్షురాలుగా నియమితులయ్యారు. ఆమెకు సూర్యాపేటలో జరిగిన పార్టీ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వేములకొండ పద్మ, జిల్లా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధలు నియామకపత్రాన్ని అందజేశారు.

ఆర్థికసాయం అందజేత

అర్వపల్లి: బొల్లంపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ కేసాని రామనర్సయ్య తల్లి, సీనియర్ నాయకురాలు అనసూయ ఇటీవల మరణించారు. దీంతో సోమవారం మున్నూరు కాపు స్ఫూర్తి సంఘం ఆధ్వర్యంలో మృతురాలి కుటుంబీకులకు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆకుల సోమేష్, తూడి మహేష్, కోనేటి జనకిరాం, కె. సుధాకర్, కదారి శ్రీను, పి.రామయ్య, రాజారాములు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ సత్తా చాటుతున్నారు

- చదువుతోపాటు ఆటల్లో రాణిస్తున్న అర్వపల్లి పాఠశాల విద్యార్థులు
- రాష్ట్ర, జిల్లా స్థాయిలో బహుమతులు



అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

అర్వపల్లి : అర్వపల్లిలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. రాష్ట్ర, ఉమ్మడి జిల్లా, జిల్లాస్థాయి పోటీలలో ఇప్పటికే అనేక బహుమతులు సాధించారు. గతంలో ఇక్కడి పాఠశాలలో పీఈటీగా పనిచేసిన లింగాల రవితో పాటు ప్రస్తుతం పీడీగా పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి. మల్లేష్‌లు ఈ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాణించడానికి కృషి చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్ పోటీలలో ఈ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన అస్లాం, ఫాతిమా, ప్రవీణ్, గణేష్‌లు రాష్ట్ర స్థాయిలో ఆడి బహుమతులు సాధించారు. జిల్లాకు కూడా సీఎం కప్ పోటీలలో 8మంది ఎంపికై బహుమతులు గెలుచుకున్నారు. అయితే ఇక్కడి పాఠశాలలో కావాల్సిన గ్రౌండ్ ఉన్నప్పటికీ దీనిని క్రీడా మైదానంగా మార్చకపోవడంతో విద్యార్థులు ఆటలు ఆడేందుకు కొంత ఇబ్బంది అవుతోంది. ఇటీవల కొన్ని ప్రభుత్వ నిధులతోపాటు పాఠశాల పీడీ మల్లేష్ స్వచ్ఛందంగా అందించిన ఆర్థిక సాయంతో క్రీడా మైదానాన్ని కొంత అభివృద్ధి చేశారు. ఇప్పటికైనా పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి క్రీడా గ్రౌండ్‌గా తీర్చిదిద్దితే విద్యార్థులు క్రీడల్లో మరింతగా రాణించే అవకాశం ఉంది.



అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన క్రీడా విభాగం గది

రాష్ట్ర స్థాయిలో బహుమతి సాధించా



మా పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికయ్యా. రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొని బహుమతి సాధించా. మా పాఠశాలలో క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేయాలి. క్రీడా మైదానం సరిగాలేక ఆటలకు ఇబ్బంది అవుతుంది.

– అస్లాం, విద్యార్థి

క్రీడలపై ప్రత్యేక దృష్టి



మా పాఠశాలలో క్రీడల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టాం. దాతల సహకారంతో క్రీడా సామగ్రిని కూడా ఏర్పాటు చేసుకుంటున్నాం. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో సీఎం కప్ పోటీలలో నాలుగు బహుమతులను సాధించాం. పాఠశాలలో క్రీడా మైదానం సరిగాలేకపోవడంతో స్వచ్ఛందంగా క్రీడా స్థలంలో మట్టిపోసి చదును చేయించాను.

– పి. మల్లేష్, పీడీ

ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దుతున్నాం



ఉపాధ్యాయుల సహకారంతో అర్వపల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌ను ఆదర్శ పాఠశాలగా తీర్చి దిద్దడానికి కృషి చేస్తున్నాం. తమ పాఠశాలకు మండలంతోపాటు చుట్టు పక్క గ్రామాల నుంచి కూడా విద్యార్థులు పెద్ద సంఖ్యలో వచ్చి చేరుతున్నారు. విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లో ప్రోత్సహిస్తున్నాం.

– ఎం. విజయలక్ష్మి, హెచ్ఎం

ట్రంప్ దురహంకార చర్యలను ఖండించాలి



ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

భానుపురి : భారతీయులకు బేడీలు వేసి పంపిస్తున్న ట్రంప్ దురహంకార చర్యల్ని ఖండించాలని, స్వదేశస్తులకు బేడీలు వేసినా ప్రధాని మోదీ స్పందించకపోవడం సిగ్గు చేటని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ సూర్యాపేట డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక విమర్శించారు. సోమవారం స్థానిక రైతు బజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. ప్రపంచ దేశాలు ట్రంప్ చర్యలను వ్యతిరేకిస్తూ నిరసన తెలుపుతుంటే మన దేశ ప్రధాని మోదీ మాత్రం మౌనం వహిస్తూ ట్రంప్‌కు మద్దతు ఇవ్వడం శోచనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు కారింగుల వెంకన్న, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్ కుమార్, పార్టీ డివిజన్ నాయకులు ఎస్‌కే సయ్యద్, చిత్తలూరి లింగయ్య, పట్టణ కార్యదర్శి గులాం హుస్సేన్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు మారసాని చంద్రకళ, ఐతరాజు పద్మ, టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి గోగుల వీరబాబు, జక్కుల శేషగిరి, ఆటో యూనియన్ నాయకుడు పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చివ్వెంల : దురాజ్‌పల్లి శ్రీలింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతర నేపథ్యంలో దురాజ్‌పల్లి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఖాసీంపేట, వల్లభాపురం, దురాజ్‌పల్లి, ఉండ్రుగొండ, తుల్జారావు పేట గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

నేడు చంద్రారెడ్డి వర్ధంతి సభ

నాగారం : మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామ స్టేజీ వద్ద మంగళవారం జరిగే యానాల చంద్రారెడ్డి వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి సంపెట కాశయ్య కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సభకు కార్యకర్తలు, పార్టీ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఆయనతో పాటు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు



స్వామి, ఆళ్వార్ల విగ్రహాల ఊరేగింపు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా అధ్యయనోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం నర్సింహస్వామి, ఆళ్వార్ల విగ్రహాలను దేవరాజవాహనం, పల్లకిలో వేర్వేరుగా ఉంచి ఆలయం చుట్టూ ఊరేగించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు అధ్యయనోత్సవ ప్రాముఖ్యతను తెలియజేశారు. అలాగే అధ్యయన మండపంలో ద్రవిడ వేదపారాయణం, మంత్రపుష్ప నీరాజనం, స్నపన తిరుమంజనం, తీర్థప్రసాదాల వినియోగం గావించారు. ఈ సందర్భంగా స్థానిక మాజీ సర్పంచ్ బైరబోయిన సునీతరామలింగయ్య అన్నప్రసాద వితరణ చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, వేల్పుల రమేష్, బైరబోయిన మహరాజు, సైదులు, రామలింగయ్య, కనుకు శ్రీనివాస్, ధర్మకర్త రాగి అనిల్, దాసరి సోమయ్య, ఈఓ వై. శ్రీనివాస్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి, చెన్నా రమేష్, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, జియర్ వెంకటనర్సింహాచార్యులు, భరతాచార్యులు, వెంకట వేణునాథచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

తప్పుల తడకగా బీసీ కుల గణన

తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణన తప్పుల తడకగా ఉందని, వెంటనే రీ సర్వే చేయాలని బీఆర్ఎస్ బీసీ సంఘం నాయకుడు తునికి సాయిలుగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ తప్పుడు లెక్కలు చెప్పి బీసీలను మోసం చేస్తోందన్నారు. మోసపూరిత కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, బీసీ సంఘం నాయకులు మట్టిపల్లి వెంకట్, గోపగాని రమేష్, ఉప్పుల నాగమల్లు, నల్లబెల్లి వెంకటేష్, గోపగాని వెంకన్న, కటకం సుధాకర్, కొల్లూరి మహేందర్, పోలేపల్లి అశోక్, అఖిల్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజానికి కృషి చేయాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

నాగారం : క్షయ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ హర్షవర్ధన్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పసునూర్ గ్రామంలో నిక్షయ శివిర్ కార్యక్రమంలో భాగంగా జాతీయ క్షయ నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్యపరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎడతెరిపిలేని దగ్గు, జ్వరం, ఆయాసం, ఆకలి మందగించటం, బరువు కోల్పోవడం, ఛాతీలో మంట వంటి లక్షణాలు ఉన్నవారు పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఒక వేళ వ్యాధి నిర్ధారణ అయితే మందులు వాడి పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు. అనంతరం గ్రామస్తులకు క్షయ వ్యాధి, మధుమేహ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ మాలోతు బిచ్చునాయక్, హెచ్ఈ విమలమ్మ, పీహెచ్ఎన్ అరుణకుమారి, సూపర్ వైజర్ రామచంద్ర, యాదగిరి, గుంటకండ్ల ప్రవీణ్‌రెడ్డి, లక్ష్మీబాయి, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంటల వివరాల నమోదు పరిశీలన



పంటల వివరాల నమోదును పరిశీలిస్తున్న ఏఓ

నాగారం : రైతులు తాము సాగు చేసే పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణకాంత్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామంలో పంటల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. నాగారం మండలంలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో రైతులు సుమారు 18,500 ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగు చేశారని తెలిపారు. రైతులు సాగు చేసిన పంటలను వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి, పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందని తెలి పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిణి శ్వేత, రైతులు ఆకుల వెంకన్న, భిక్షం, యాదగిరి పాల్గొన్నారు.

విద్యార్థుల చదువులో తల్లిదండ్రుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న తహసీల్దార్ అమీన్‌సింగ్

మద్దిరాల: పిల్లల చదువులో తల్లిదండ్రుల పాత్ర కీలకమైనదని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల పేరెంట్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు బాగా చదవాలంటే పాఠశాలలో గురువులతోపాటు ఇంటి వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకోవాలని అన్నారు. పాఠశాలలో ఉన్న 25 మంది విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవికుమార్, హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటరు ముసాయిదా విడుదల



అర్వపల్లి : ఓటరు ముసాయిదాను విడుదల చేస్తున్న ఎంపీఓ గోపి, కార్యదర్శులు

అర్వపల్లి : జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ముసాయిదా ఓటరు జాబితాను సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓ టి. గోపి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పారదర్శకంగా ముసాయిదాను సిద్ధం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నవీన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జ్యోతి, ఫర్హాన, నెహ్రూ నాయక్, లింగయ్య, శ్రావణి, సంతోష, వివిధ గ్రామాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిరాల : మండలంలోని ప్రాదేశిక నియోజకవర్గాలకు చెందిన ఓటరు జాబితాను సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ అమీన్‌సింగ్, ఏపీఓ గుండు వెంకన్న, ఈసీ చారి, వెంకట్, పంచాయతీ కార్యదర్శులు పుష్ప, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీల వారీగా సోమవారం ఓటరు జాబితాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎండీ హసీం మాట్లాడారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు ఎంపీటీసీల వారీగా మండల వ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్యాలయాలలో, ఎంపీడీఓ కార్యాలయంలో ఓటర్ జాబితాను ప్రదర్శించినట్లు తెలిపారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు కార్యక్రమంలో ఎంపీఓ రాజేష్ గౌడ్, సూపరింటెండెంట్ వెంకటాచారి, హసన్ అలీ, మాధవి, భిక్షం, విజయ్, గౌతమ్ పాల్గొన్నారు.

సారా తయారీదారులపై చర్యలు తప్పవు



జల్మాలకుంట తండాలో బెల్లం పానకం ధ్వంసం చేస్తున్న ఎస్ఐ గోపికృష్ణ

పెన్‌పహాడ్ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నాటు సారా తయారు చేసి విక్రయించే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ గోపికృష్ణ అన్నారు. సోమవారం జల్మాలకుంట తండా శివారులోని వ్యవసాయ క్షేత్రం వద్ద సారా తయారు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసు దాడులు నిర్వహించారు. సారా తయారీకి ఉపయోగించే 40లీటర్ల బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకొని ధ్వంసం చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సారా తయారీకి పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో సిబ్బంది ప్రవీణ్, లింగరాజు, రామాంజనేయులు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చివ్వెంల : సూర్యాపేట మండలం యండ్లపల్లి గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది పంతంగి క్రిష్ణ తల్లి పంతంగి గంగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలి కుటుంబాన్ని సూర్యాపేట బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, న్యాయవాదులు టేకులపల్లి శ్రీనివాస్‌రావు, దాసరి వెంకటేశ్వర్‌రావు, దోరెపల్లి రమేష్, కంచర్ల సతీష్ కుమార్, అల్లంనేని వెంకటేశ్వర్‌రావు, ఎం.కిశోర్, కట్ట సుధాకర్, వీరబోయిన ఉపేందర్, జువ్వా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోశాల ప్రారంభోత్సవం



గోశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న కొప్పుల వేణారెడ్డి, తదితరులు

సూర్యాపేట : శ్రీసాయి సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శ్రీసాయి నగర్‌లో నూతనంగా నిర్మించిన గోశాల ప్రారంభోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గోపూజ, ద్వార పూజ, గోశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన దీక్షధారణ, అఖండ స్థాపన, వాస్తు మండపారాధన, అగ్ని మదనం, రుద్రహోమం, వాస్తుబలి పర్యగ్నికరణ, శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి దంపతులు హాజరై పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోవులకు పూజలు నిర్వహించారు. వేజెండ్ల వాస్తవ్యులు బ్రహ్మశ్రీ గూడూరి గోపికృష్ణ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీసాయి సేవా సమితి ట్రస్ట్ అధ్యక్షుడు కర్నాటి రవికుమార్, ప్రధాన కార్యదర్శి మన్నెం సదాశివరెడ్డి, కోశాధికారి పోతుగంటి మల్లికార్జున్, మందిర అర్చకులు వలివేటి విశ్వేశ్వర శర్మ, గంగాధర శర్మ, తల్లాడ వెంకటేశ్వర్లు, మొరిశెట్టి శ్రీనివాస్, గుండా రమేష్, నరేందర్‌రెడ్డి, తల్లాడ రాంప్రసన్న, పటేల్ నరసింహారెడ్డి, రవీంద్రనాథ్, సైదులు, సూర్యనారాయణమూర్తి, నరసింహారావు, బొమ్మిడి శ్రీనివాస్, రాంబాబు, శ్రీరామ్‌కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి



ఫణిగిరి మేరీ మదర్ స్కూల్‌లో విద్యార్థులతో ఎమ్మెల్యే మందుల సామేల్

నాగారం : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం ఫణిగిరి మేరీ మదర్ ఆఫ్ హోప్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల 23వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకొని లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలన్నారు. మంచి ర్యాంకులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని 10వ తరగతి విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బిషప్ కర్ణం ధమన్‌కుమార్, పాస్టర్ జోసెఫ్, పాఠశాల మేనేజర్ రీనా, హెచ్ఎం సిస్టర్ రోజ్‌మేరీ, నాయకులు సుంకరి జనార్దన్, బాలకృష్ణ, ఉపాధ్యాయులు సతీష్, శ్రవణ్‌కుమార్, యాకయ్య, వేణుధర్, వెంకటేష్, లెవిన్, షహెనా, శైలజ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల నిర్వహణకు విరాళం



అర్వపల్లిలో చైర్మన్ వెంకట్‌రెడ్డికి రూ.50వేల చెక్కు అందజేస్తున్న సుంకరి జనార్దన్

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణకు తిరుమలగిరి మాజీ వైస్ ఎంపీపీ, కాంగ్రెస్ జిల్లా నాయకుడు సుంకరి జనార్దన్ సోమవారం దేవాలయంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డికి రూ. 50వేలు విరాళంగా అందజేశారు. బ్రహ్మోత్సవాలను ఎమ్మెల్యే సామేల్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్, బైరబోయిన మహరాజు, సైదులు, రామలింగయ్య, దాసరి సోమయ్య, ధర్మకర్తలు కృష్ణమూర్తి, అనిల్, మాజీ సర్పంచ్ జీడి వీరస్వామి, కొప్పోజు వెంకన్న, చెన్నా రమేష్, కరుణాకర్, మేడి సంపత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు, డిక్షనరీల పంపిణీ



తుంగతుర్తి : బండరామారం జెడ్పీహెచ్ఎస్‌లో డిక్షనరీలను పంపిణీ చేస్తున్న దాత సీతయ్య



నాగారం : విజయనగర్ కాలనీలో విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న దాత లక్ష్మమ్మ

తుంగతుర్తి: బండరామారం జెడ్పీహెచ్ఎస్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య సోమవారం తన పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, డిక్షనరీలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకన్న, డిక్షనరీ రచయిత హకీమ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

నాగారం : నాగారంబంగ్లా ఆవాసం విజయనగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం గ్రామానికి చెందిన గుంటకండ్ల లక్ష్మమ్మ తన భర్త గుంటకండ్ల వెంకట్‌రెడ్డి జ్ఞాపకార్థం విద్యార్థులకు ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ప్లేట్లను బహూకరించిన దాత లక్ష్మమ్మను పాఠశాల బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఉమామహేశ్వరి, ఉపాధ్యాయురాలు కలమ్మ, వెంకటేశ్వర్లు, సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇరు వర్గాలపై కేసు నమోదు

నూతనకల్ : మండల కేంద్రంలో ఘర్షణ పడిన ఇరు వర్గాలపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ మహేంద్రనాథ్ తెలిపిన ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బద్దం ప్రశాంత్‌రెడ్డి, బద్దం మహేందర్‌రెడ్డి భూ తగాదాల నేపథ్యంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ సంఘటనలో ప్రశాంత్‌రెడ్డికి చెందిన ఆరుగురిపై, మహేందర్‌రెడ్డికి చెందిన ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారిని తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు ఎదుట బైండోవర్ చేశారు.

బీటీ రోడ్డు నిర్మాణం



పనులను పరిశీలిస్తున్న చైర్మన్, నాయకులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతుండటంతో భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా స్థానిక హైవే వద్ద నుంచి దేవాలయం వరకు ఎమ్మెల్యే సామేల్ ఆదేశాల మేరకు బీటీ రెన్యూవల్ పనులు చేయిస్తున్నట్లు దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం బీటీ రెన్యూవల్ పనులను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో గుడిపల్లి మధుకర్‌రెడ్డి, వేల్పుల రమేష్, బైరబోయిన మహరాజు, సైదులు, రామలింగయ్య, దాసరి సోమయ్య, మాజీ సర్పంచ్ వీరస్వామి, ధర్మకర్త అనిల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నివాళి

అర్వపల్లి : అర్వపల్లికి చెందిన సీనియర్ నాయకుడు వాకిటి వీరయ్య సోమవారం మృతి చెందారు. మృతుడికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్ నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో శిగ నసీర్‌గౌడ్, మేకల రాంబాబు, బైరబోయిన రామలింగయ్య, కనుకు శ్రీనివాస్ ఉన్నారు.